చెప్పాడు.'' అని జేబులో నుంచి ఓ కాగితం మడత విప్పి కూతురు ముఖానికి కొట్టి, కోపంగా బయటికి వెళ్ళిపోయాడు.

కొయ్యబారుతున్న మనోరమ తెప్పరిల్లుకుని—ఉత్తరం ఆత్రంగా చదివింది. ఆ ఉత్తరం అసలు పాణి రాసింది కాదు. పాణికి వాళ్ళ నాన్న రాసిన ఉత్తరం.

చి॥ పాణిని ఆశీర్వదించి మీ నాన్న వ్రాయునది.

నువ్వు చూసి వచ్చిన సంబంధం నిశ్చయం చేయాలనుకున్నాను. నువ్వు కోరిన ప్రకారమే వాళ్ళు పదివేలు కట్నం ఇచ్చి లాంఛనాలు జరపడానికి ఒప్పుకున్నారు. పాపం వాళ్ళకది కష్టమే అయినా—మనమేమి చేయగలం?

మధ్య తరగతి కుటుంబాల్లో ఈ రకమైన ఇబ్బందులు తప్పవు: నీకిచ్చే కట్నంతో—పెద్ద చెల్లాయి పెళ్ళి చేయాలిగదా?—సరే నువ్వు నెల నెలా పంపించే డబ్బుతో ఇంటి మీద అప్పు తీర్చేస్తున్నాను. అమ్మకి ఈ మధ్య కులాసాగానే వుంటోంది. బావగారి అలక తీర్చటానికి మొన్ననే బట్టల కొట్లో కాతాలో రాయించి రెండు సూట్లకి పంపించేను. తమ్ముడి చదువు ఏదో సాగుతోంది. చిన్న చెల్లాయిని ప్రవేటుగా హిందీ పరీక్షకు పంపిస్తున్నాను. నువ్వు వీలు చూచుకుని మరొకసారి వస్తే లగ్న నిశ్చయం చేసుకుందాం.

మీ నాన్న

ఆ ఉత్తరం క్రింద రెండు ముక్కలు పాణి స్వహస్తంతో మనోరమకి వ్రాసేడు.

''మనోరమా: మా నాన్న రాసిన ఉత్తరం చదివేవుగదూ? మా ఇంటి పరిస్థితులు అర్థమయ్యాయా? — మనమంతా ఒకే పడవలో ప్రయాణం చేస్తున్న సమాన వ్యక్తులం. రంగుల కలలు కనడం తేలిక; కానీ అవి జరగడం చాలా కష్టం. జీవితం వేరు. కథలు వేరు. మానసికంగా మనిషి ఎదగడానికి అనుభవాలే గొప్ప పాఠాలు. పెళ్ళివారు వచ్చేవేళకి చక్కగా ముస్తాబై — పిల్లాణ్ణి మెప్పించు—ఆ తర్వాత మంచి గృహిణిగా పేరు తెచ్చుకో''—

ఇట్లు నీ మంచి కోరే
పాణి

అనుకోకుండా రెండు కన్నీటి చుక్కలు రాలి ఆ ఉత్తరం మీద పడ్డాయి. తర్వాత మనోరమ పెళ్ళి చూపులకి సిద్ధమైంది: □



భరతనాట్యం అభ్యసించిన

## రష్యన్ బాలిక

# మెరీనా ఇవనోవా

నాలుగేళ్ళకు ముందు ఒకరోజు. ఆ రోజు సాయంకాలం భరతనాట్య తార కుమారి పద్మాసుబ్రహ్మణ్యం ఢిల్లీలో భరతనాట్య ప్రదర్శన ఇస్తున్నారు. రంగస్థలం మీద మెరుపుతీగెలా కదిలి, లయబద్ధంగా, శాస్త్రీయంగా భరతనాట్యం చేస్తున్న పద్మ ప్రతి కదలికనూ ఒక రష్యన్ బాలిక ఆశ్చర్యంగా చూసింది. ప్రదర్శన పూర్తయేలోపునే ఆ అమ్మాయికి ఓ ఆశ కలిగింది. తానూ భరతనాట్యం ఆడితే ఎలా వుంటుంది అనిపించింది. ఆ అమ్మాయి ఆ తర్వాత పద్మను కలుసుకుని తన కోరిక చెప్పింది. 'మరి నేను రష్యా పిల్లను కదా? నాకు భరతనాట్యం ఎలా వస్తుందండీ?' అని అనుమానం వ్యక్తం చేసింది. 'అమ్మాయ్! నీకు నాట్యం నేర్చుకోవాలనే ఆశ ఉంటే చాలు. నీ శ్రద్ధే ప్రధానం. నువు రష్యన్ పిల్లవయినంతమాత్రాన భరతనాట్యం నీకు రాకపోదు' అన్నారు పద్మ ఆ అమ్మాయిని ప్రోత్సహిస్తూ.

ఓ ఏడాది గడిచింది. ఆ రష్యన్ బాలిక తండ్రి వి. వి. ఇవనోవా ఢిల్లీనుంచి మద్రాసుకు బదిలీ అయి వచ్చారు. (ఆయన ప్రస్తుతం మద్రాసు యు. ఎస్. ఎస్. ఆర్. కాన్సలేట్ జనరల్‌లో వైస్ కాన్సల్‌గాను, కాన్సలేట్‌వారి సాంస్కృతిక శాఖ అధ్యక్షుడుగాను పదవి వహిస్తున్నారు.)

దాంతో భరతనాట్యం నేర్చుకోవాలనే ఆ అమ్మాయి కోరిక తీరే అవకాశమూ కలిసి వచ్చింది. పద్మాసుబ్రహ్మణ్యం నిర్వహణలో నడుస్తున్న 'నృత్యోదయ' లో చేరి, ఆమె దగ్గర భరతనాట్యం నేర్చుకోసాగింది ఆ అమ్మాయి. అడుగులు వేయడంలోనూ, రకరకాల ముద్రలు పట్టడంలోనూ, లయ తప్పకుండా నాట్యం చేయడంలోనూ త్వరత్వరగా ప్రావీణ్యం సంపాయించింది. ఆ అమ్మాయి పేరు మెరీనా ఇవనోవా. వయసు 11 సంవత్సరాలు.

జూలై 23 న మద్రాసులోని హౌస్ ఆఫ్ సోవియట్ కల్చర్‌లో మెరీనా ఇవనోవా 'నాట్యరంగ ప్రవేశం' చేసి పదిమంది ప్రశంసలూ అందుకున్నది.

''ఇంత చిన్నపిల్ల ఇంత అద్భుతంగా అభినయిస్తూ నాట్యం చేయడం చాలా గొప్ప విషయం. ఇలాంటి నైపుణ్యం గల శిష్యురాలిని తయారు చేసిన కుమారి పద్మ అభినందనీయులు. ఇప్పుడు ఆమెతో సరిపోల్చగల శిష్యురాలు తయారయింది'' అన్నారు తమిళనాడు గవర్నర్ శ్రీ కె. కె. షా—మెరీనా భరత నాట్యాన్ని చూశాక. ఆయన ఆమె రంగప్రవేశ కార్యక్రమానికి అధ్యక్షత వహించారు.

ప్రఖ్యాత భరతనాట్యవేత్త వళువూర్ రామయ్య పిళ్లై-మెరీనా ప్రావీణ్యాన్ని ప్రశంసించారు. "ఇంత చిన్న వయసులోనే ఇంత అద్భుతమైన ప్రతిభ కనబరుస్తున్న ఈ అమ్మాయి పెరిగి పెద్దయేకొద్దీ మరింత గొప్ప భరతనాట్య తార కాగలదని నా నమ్మకం!'' అన్నారు ఆయన.

భరతనాట్యాన్ని శాస్త్రీయంగా ఓనామాల నుంచి నేర్చుకున్న మొదటి రష్యన్ నాట్య విద్యార్థినిగా కుమారి మెరీనానే చెప్పుకోవచ్చు.

మెరీనా ఇవనోవా ఈ అగస్టు మాసంలో రష్యా దేశం వెళ్తున్నది. అక్కడ భరతనాట్య ప్రదర్శన లిచ్చి, భరతనాట్య ప్రశస్తిని రష్యాలో చాటుతుంది! అదే తన ధ్యేయం అని కూడా ఆమె చెప్పింది.

